# ముందుగతి కానవే చిలకా!

భారతేతిహాసంలో సువర్ణాక్షరాలతో లిఖించ దగిన పుటలను, అధికాధికంగా చేర్చిన ఘనత మహారాష్ట్రులకే దక్కుతుందంటారు చరిత్ర కారులు. మహమ్మదీయ ప్రభువుల దాటికీ, భారతదేశం క్రక్కదలిపోతున్నప్పుడు, ఆ ఉధృతాన్ని కొంతకు కొంతైనా ఆపినవారు మహారాష్ట్రులే. ఈస్ట్ ఇండియా కంపెనీ రోజుల్లోనూ ఆ తరువాత కూడా మహారాష్ట్రులు అక్షరాలా చరిత్రనే సృష్టించారు.

“ఈనాడు” యశ్వంతరావును చూస్తే, అతని స్థితిగతులు గమనిస్తే, మనకుసందేహం కలుగుతుందేమోగానీ, అతని పూర్వుల్ని చూస్తే మాత్రం కలగదు- కలగదని యశ్వంతరావు అంటారు. అతని పూర్తి పేరు నానాజీ యశ్వంతరావు పలూస్కర్. చిన్నప్పుడు నానాజీ అనేవారుట. కొంత యశ్వంతరావుగా చెలామణీ అయ్యాడు.

తన పందొమ్మిదో ఏట వో సర్కస్ కంపెనీ పూనా వచ్చిందట. అప్పుడు తను స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు. నాన్న జేబులోంచి రెండణాలు కాజేసి మొదటి రోజున మొదటి ఆట చూశాడు. అదే అతను చూసిన మొదటి సర్కస్. గుమ్మెత్తి పోయాడు. జేబు ఖర్చుకోసం మిగిల్చిన రెండో అణాతో రెండో ఆట కూడా చూశాడు. ఇంటికి రాబుద్ధి కాలేదు. వచ్చిన నిద్రపోబుద్ధి కాలేదు. కళు ్ళ మూసినా తెరిచినా, ఆ సర్కస్‌లోని ఫీట్లే కళ్ళ ముందు తారట్లాడసాగాయి.

“అదే నా జీవితంలో వో పెద్ద మలుపు. పూనాకు ఆ సర్కస్ కంపెనీ రాకపోయినా మా నాన్న జేబులో ఆ వేళ రెండణాలు లేకపోయినా, నా బతుకు యింకోలా వుండేది. మా నాన్న ప్లీడరు గుమాస్తా. నెలకు అయిదు రూపాయల జీతం, పైపైన మరో పది దాకా పిండుకొనేవారు. నన్ను ‘లా’ చదివించి ప్లీడరీ బోర్డు కట్టించాలని ఆయన తపన. కాని అది నా ద్వారా తీరింది కాదు. మా రెండో తమ్ముడు ప్లీడరీ చదివాడు. బోర్డు కట్టాడు. ప్రాక్టీసు లేదు. ఇంకేదోపని చూసుకొన్నాడు...” అన్నాడు పండిట్ యశ్వంత్‌జీ.

అల్లానాడు పూనా వచ్చిన సర్కస్ కంపెనీ, ఆరువారాల పాటుపూనాలో వున్నది. ఆ కంపెనీలో ఇద్దరు జర్మనీ దొరలు, దొరసానులు కూడా ఉండేవారు. చెడ్డీలు బిగించుకొని హారిజాంటల్ బార్ మీద ఫీట్లు చేస్తున్న ఆ దొరసానుల్ని, తన్మయుడై చూసేవాడు నానాజీ. స్కూలుకు ఎగనామం పెట్టి అన్ని రోజులూ, అన్ని ఆటలూ చూశాడు. రాను రాను ఆ కంపెనీ వారితో అతనికి స్నేహం కుదిరింది. పగలంతా పులులు, సింహాలు, ఏనుగులు, ఒంటెల దగ్గర గడిపేవాడు. వాటికి మేత వేయడంతోనూ, బోనుల్ని ‘ఎరీనా’లోకి తోలుకు రావడంలోనూ సాయం పట్టేవాడు. మేకులు పాతడం, మేకులు బిగించడం, బల్లలు పట్టడం వంటి పనుల్లో జోక్యం చేసుకొనేవాడు. ఆఖరికి ఆ కంపెనీ బొంబాయి బయలుదేరినపుడు దాంతో బాటు నానాజీ కూడా బొంబాయికొచ్చేశాడు.

“ఆ పట్టు పట్టు 35 సంవత్సరాల పాటు నేను సర్కస్ కంపెనీల్లో పని చేశాను. కంపెనీలంటే ఎన్నో కాదు. కేవలం మూడు కంపెనీల్లోనే పని చేశాను. హారిజాంటల్ బార్ మీద ఫీట్స్ చేయడం, ఉ క్కుతీగమీద వొంటిగాను సైకిల్ తొక్కడం, నేను స్పెషలైజ్ చేశాను. నేనీ విద్యను జర్మనీ దొరల దగ్గర నేర్చుకున్నాను”అన్నాడు పండిట్ యశ్వంత్‌జీ.

సర్కస్ కంపెనీలో చేరిన అయిదేళ్ళ తర్వాతగానీ, తన సొంత వూరు రాలేదు. అప్పటికే అతని శరీరం ఉక్కుముక్కలాగా తయారయింది. తొడ, మెడ, వీపు, పిక్కలు ఇవన్నీ బలిసి చిట్టెంకట్టుకు పోయినట్టుగా ఉండేవి. తల్లీ తండ్రీ తమ్ముళ్ళూ అతనిని చూసి బావురుమని ఏడ్చారు. "అయినా నేను వినలా, వినబుద్ధిగాలేదు. అసలు నేను చచ్చిపోయాననుకున్నారుట. పలూస్కర్ పేరు విన్నారుట గానీ, అది నా పేరేనని అనుమానం కూడా రాలేదుట. సర్కస్‌లో పూర్తిగా చేరిపోయాక నా పేరు పలూస్కర్ శాండోగా మార్చుకున్నాను. ఒకసారి ఆ సర్కస్ మేనేజర్‌కూ నాకూ మాట మీద పట్టింపు వచ్చింది. నన్ను డిస్మిస్ చేస్తానన్నాడు. నేనే రాజీనామా చేసి బయటకొచ్చాను. అప్పుడు మా కంపెనీ ఢిల్లీలో వుంది. ఇంకో కంపెనీ కూడా ఢిల్లీలో ప్రదర్శనలిస్తున్నది. నా పేరుమీదుగా మంచి పబ్లిసిటీ యిచ్చి బాగ డబ్బు సంపాదించింది కంపెనీ. నన్నంత సులువుగా విడిచిపెడతారనుకోలేదు. కానీ, రాజీనామా కాగితం కూడా లేదు. మాట వింటూనే కంపెనీ యజమాని వెళ్ళమని నా వైపు చూశాడు. మరో కంపెనీలో చేరడం నా కిష్టంలేదు. రెండు మూడు రోజులు ఖాళీగానే వున్నాను. నా ప్రదర్శన లేకపోవటానికి కారణమేమిటో రెండో కంపెనీలవారు కూపీ తీసారు. నన్ను పట్టుకొని తమ కంపెనీకి లాక్కుపోయారు. అపుడే నేను పండిట్‌జీతో ఫోటోదిగాను" అంటూ తన పాత సంచీలోంచి ఓ ఫోటోను తీసి చూపించాడతను. ఆ రోజుల్లో ఎంత బలంగా వుండేవాడో, ఆ ఫోటో చూసిందాకా మనం ఊహించలేం. అప్పుడింత కద్దు మీసాలు లేవు. కోర మీసంతో, ఏనుగ్గున్నలా వుండేవాడు.

"అప్పుడే నేను ఇండియా అంతా తిరిగాను. శ్రీనగర్ నుండి త్రివేండ్రం దాకా బొంబాయి నుండి గౌహతి దాకా ముఖ్యమైన మహానగరాలూ, పట్నాలూ, చూశాను. అక్కడివాళ్ళతో కలిసి మెలసి తిరిగాను. రకరకాల భోజనాలూ రుచి చూశాను. సర్కస్ కంపెనీ అంటేనే నానాజాతి సమితికి నకలుగా ఉంటుందనుకోండి. అన్ని భాషల వాళ్ళూ, అన్ని కులాల వాళ్ళూ, మాలో వున్నారు. దీనికి తోడు దేశాలు తిరగడమొకటి. అందువల్ల నాకు చాలా భాషలు తెలుసు. పండితుణ్ణి కాదుగానీ అవతలి వారు మాట్లాడుతుంటే అటూ ఇటూగా అర్థం చేసుకొంటాను. నేను ఇక్కడ కూడా చాలా ప్రదరద్శనలిచ్చానండీ. విజయనాగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, భీమవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, తిరుపతి చాలాచోట్ల తిరిగాను. గుంటూర్లో మా కంపెనీ మూడు సంవత్సరాలుగా వరుసగా ఆడింది... అదే చెప్పబోతున్నాను. నేను మద్రాసులో వుండగా మూడో కంపెనీలోకొచ్చేశాను. ఈ కంపెనీవారు విదేశాలకు పోతామన్నారు. అక్కడిక్కూడా వెడదామన్న ఉద్దేశ్యంతో, ఆశతో చేరాను. వారు పోలేదు. ఈ కంపెనీలో వున్నప్పుడే, నేను పట్టుజారి రెండు తాడిచెట్ల ఎత్తు నుండి కిందపడ్డాను. ఎడంకాలు చిదికిపోయింది. నేనిక సర్కస్ కంపెనీకి పనికి రానుగనుక తీసేశారు" అన్నాడు పండిత్ యశ్వంత్‌జీ.

బతుకొక సమస్యగా పరిణమించింది. తను సలూస్కర్ శాండోనని చెప్పుకొని ఎంతో కాలం బతకలేకపోయాడు. సర్కస్ కంపెనీల్లో పనిచేసినప్పుడు తను అట్టే కూడబెట్టింది కూడా ఏమీ లేదు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో తన జేబులో వున్న అణా కాసునిచ్చి మౌంట్ రోడ్‌లో ఫుట్‌పాత్‌మీదున్న చిలుక జోస్యునిచేత భవిష్యత్తు చెప్పించుకొన్నాడు. అణాను అటూ యిటూ తిప్పి చూసుకొని దాన్ని రొండిన దోపుకొని పంజరం తలుపు తెరిచాడు అయ్యగారు. చిలుక వచ్చి ముక్కుతో

వో కార్డును వెలికితీసి, అయ్యగారిచ్చిన వడ్లగింజలను గుటుక్కన మింగి లోపలికి పోయింది. కార్డు విప్పి చూస్తే, 'త్వరలోనే నీకు మంచికాలం వస్తుంది. కొద్ది శ్రమతో, నీవనుకొన్నవన్నీ సాధిస్తావు'' అని వుంది దానిమీద.

''పొంగిపోయానండీ. కానీ నాకెలా మంచికాలం వస్తుందన్న ఆలోచనే నాకు రాలేదు. ఆ మద్రాసులోనే దినపస్తులు చేశాను. ఆఖరికి అదే అయ్యగారిని మళ్ళా కలిసి అడిగాను. సరే అతనేం చెప్పాడని కాదుగానీ వేలికున్న ఉంగరం అమ్మి, మూర్ మార్కెట్ దగ్గర నేను చిలకనీ, కార్డుల్నీ కొని బిజినెస్ ప్రారంభించాను. పది పన్నెండేళ్ళయింది. వందలు సంపాదించలేకపోయినా, పొట్టకూటికి మాత్రం ధోకా లేదు.

చిలక జోస్యం ప్రారంభించినపుడే తన పేరు పండిట్ యశ్వంత్‌జీగా మార్చుకొన్నానన్నాడు. ఆవూరు ఈ వూరూ అన్న నిబంధన లేదనీ, అన్ని చోట్లకూ తిరుగుతూ వుంటాననీ, రైళ్ళల్లో టిక్కెట్టు లేకుండానే ప్రయాణం చేస్తుంటాననీ పండిట్‌జీ అన్నాడు.

''నీ జోస్యం నిజమవుతుందా? అనీ - అవుతుందని గ్యారంటీ యిస్తావా అనీ నన్నడక్కండి. నిజమైనా కాకపోయినా నా చిలక చెడు మాత్రం చెప్పదు'' అన్నాడు పండిట్‌జీ నవ్వుతూ.

అవునూ ఎలా చెబుతుందీ?

చిలక తీసే కార్డులన్నింటిలోనూ అందరికీ అన్ని కాలాలకూ సరిపోయే వాక్యాలు మూడు నాలుగు భాషల్లో వుంటాయాయె.

''మీరు కోరుకొంటున్నది లభించకుండా కొన్ని దుష్ట శక్తులు అడ్డుకొంటున్నాయి''.

''మీరు ప్రేమించుతున్నవారు, మిమ్మల్ని ప్రేమించకపోయే ప్రమాదమున్నది''

''మీరు మరీ మంచివారు. ఈ మంచితనమే మిమ్మల్ని యిబ్బందుల పాలు చేస్తుంది''.

ఈ వాక్యాలు వర్తించని వారు ఎవరు గనుక?

ప్రజా జీవితం రోజురోజుకూ దిగనాసిల్లి పోతున్నది. భవిష్యత్తు అయోమయంగా తయారవుతున్నది. ఆ అంధకారంలో, ఎక్కడన్నా ఆశారేఖలు గోచరమవుతాయేమోనన్న వెదుకులాట మనలో ఉన్నంత కాలం పండిట్ యశ్వంత్‌జీ వ్యాపారానికి ధోకా వుండదు. రోజుకు మూడు నాలుగు సంపాదించుకోనూ గలదు. బ్రహ్మచారి గనక ఏ బాదరబందీ లేకుండా వచ్చిన దానితో సరిపెట్టుకోనూ గలడు.